సాక్షి
ఏలూరు
గురువారం । 30 । నవంబర్ । 2023



లక్ష పుష్పార్చన
జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా లక్ష లిల్లీ పూలతో పుష్పార్చన చేశారు. 8లో



మావుళ్లమ్మకు సారె
భీమవరం (ప్రకాశంచౌక్) : మావుళ్లమ్మవారి మండల దీక్షధారులు అమ్మవారికి సారె సమర్పించారు. ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు. 8లో



జాతీయ పోటీలకు ఎంపిక
ఏలూరు రూరల్: జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎస్కే అలీష (ఏలూరు) ఎంపికయ్యాడు. వచ్చేనెల 3 నుంచి పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడు. 8లో

న్యూస్‌రీల్

ఉద్యోగ కల్పనకు ఎంఎస్ఎంఈ సర్వే దోహదం

ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి



ఏలూరు(మెట్రో) : జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంఎస్ఎంఈ సర్వే ప్రధాన ఉద్దేశమని ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ సమావేశపు హాలులో బుధవారం సూక్ష్మ, మధ్య తరహా పారిశ్రామికవేత్తల (ఎంఎస్ఎంఈ) ట్రాకింగ్ సర్వేపై ఏలూరు డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులు, వార్డు సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అలాగే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు మరింత మెరుగుపరచడం, ఆయా పరిశ్రమల్లో మానవ వనరుల అవసరం తెలుసుకుని, ఆయా రంగాల్లో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ మేరకు సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే వచ్చే నెల 10 నుంచి 20వ తేదీ జరుగుతుందని, సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. శిక్షణలో సర్వేకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిగా అవగాహన పొంది, ప్రభుత్వం రూపొందించిన విధానంలో సక్రమంగా సర్వే పూర్తి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

1న ద్వారకాతిరుమలలో జగనన్నకు చెబుదాం

ఏలూరు(మెట్రో): మండలస్థాయి జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌డే నిర్వహణలో భాగంగా ద్వారకాతిరుమలలో వచ్చేనెల 1న కార్యక్రమం నిర్వహించనున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ద్వారకాతిరుమలలో శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

2న విలువిద్య పోటీలు

చింతలపూడి : ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల విలువిద్య పోటీలను వచ్చేనెల 2న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రౌండ్, కాంపౌండ్, రికర్వ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహమ్మద్ అంజాద్ అలీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరిస్తారని తెలిపారు. క్రీడాకారులు సెల్ 85019 33574 వాట్సాప్ నంబర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

9 నుంచి ఐఆర్‌సీటీసీ యాత్ర



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో భారత్ టూరిస్టు రైలును వచ్చే నెల 9 నుంచి 17 వరకూ నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ డివిజన్ ఏరియా అధికారి ఎం.రాజా తెలిపారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ యాత్రలో భాగంగా పూరి, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ క్షేత్రాలను దర్శించవచ్చన్నారు. రైలు 9వ తేదీ సికింద్రాబాద్‌లో ప్రారంభమై విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, విశాఖ మీదుగా వెళుతుందన్నారు. ఎకానమీ క్లాసు టికెట్ ధర రూ.15,200, స్టాండర్డ్ క్లాస్ ధర రూ.24 వేలు, కంఫర్ట్ క్లాస్ ధర రూ.31,500గా నిర్ణయించారన్నారు. వివరాలకు బాలాజీ 8287932312, ప్రవీణ్ 9281495848 నంబర్లలో సంప్రదించాలని కోరారు. చీఫ్ సూపర్‌వైజర్ వీవై ప్రసాద్, టూరిజం అసోసియేట్ వి.బాలాజీ పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో ఈడీ సోదాలు

భీమవరం: పట్టణంలో ప్రముఖ వ్యాపారి ఇంట్లో బుధవారం ఈడీ సోదాలు నిర్వహించింది. గతంలో భారీ ఎత్తున వ్యాపారం నిర్వహించడమేగాక వ్యాపార సంఘంలో పెద్దస్థాయి పదవులు నిర్వహించిన వ్యాపారి నివాసంలో విశాఖ నుంచి వచ్చిన ఈడీ ఉన్నతాధికారితోపాటు 10 మంది సిబ్బంది సోదాల్లో పాల్గొన్నట్లు సమాచారం. వ్యాపారి బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు జమకావడంతో ఈడీ అధికారులు అనుమానంతో గోప్యంగా సోదాలు చేసినట్టు ప్రచారం సాగుతోంది.

ఇంటింటికీ తాగునీరు

మిషన్.. జలజీవన్

- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో ముమ్మరంగా పనులు
- 381 పనులకు రూ.37.73 కోట్ల వ్యయం
- పైపులైన్ల ఏర్పాటు.. ట్యాంకుల నిర్మాణం

జంగారెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంతంలో తాగునీటి వనరులు పెంచుకోవడానికి గాను ప్రతి ఇంటికీ మంచి నీటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికీ పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం జలజీవన్ మిషన్ అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో మంచినీటి సౌకర్యం లేని ఇళ్లకు ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఆ గ్రామంలో అవసరమైన చోట తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా అన్ని గ్రామీణ గృహాలకు స్వచ్ఛమైన, తగినంత నీటిని అందించాలని లక్ష్యంగా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ నిర్వహిస్తోంది. తగినంత పరిమాణంలో, నిర్దేశించిన నాణ్యతతో కూడిన నీటిని నిత్యం అందుబాటులో ఉంచనున్నారు. గ్రామాల్లో నీటి సరఫరాకు మౌలిక సదుపాయాలను రూపొందించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం, సమర్థవంతంగా అమలుచేయడం జల్ జీవన్ మిషన్ పథకం లక్ష్యం.

స్వచ్ఛమైన నీరందించేలా..

గ్రామంలో పైపుల ద్వారా నీటి సరఫరా వ్యవస్థను నిర్మించడం, ప్రతి గ్రామీణ కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడటం, నీటి సరఫరా వ్యవస్థ దీర్ఘకాలిక సాధ్యతను నిర్ధారించడానికి నమ్మకమైన తాగునీటి వనరులను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను జల జీవన్ మిషన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రతి గ్రామీణ గృహానికి అవసరమైన చోట భారీ నీటి బదిలీ, పంపిణీ నెట్‌వర్క్‌లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు అందుబాటులో ఉంచనున్నారు.



శ్రీనివాసపురంలో మంచినీటి ట్యాంకు

టెండర్ల దశలో 117 పనులు

జంగారెడ్డిగూడెం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలో 264 పనులు చేపట్టగా వీటి కోసం రూ.20.63 కోట్లు వెచ్చిస్తున్నారు. వీటిలో కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే మరో 117 పనులు చేపట్టి రూ.17.10 కోట్లు వెచ్చించనున్నారు. ఈ పనులన్నీ ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. మొత్తంగా 381 పనులకు గాను రూ.37.73 కోట్లు వెచ్చించనున్నారు.



అక్కంపేటలో ఓ ఇంటిలో అమర్చిన కుళాయి

జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పనులు

మండలం	చేపట్టిన పనులు	వ్యయం (రూ.లక్షల్లో..)
చింతలపూడి	69	442.32
జంగారెడ్డిగూడెం	51	409.00
కామవరపుకోట	48	252.95
లింగపాలెం	36	126.06
ద్వారకాతిరుమల	60	833.08
మొత్తం	264	2,063.41

టెండర్ల దశలో పనులు

మండలం	పనులు	ఖర్చు (రూ.లక్షల్లో..)
చింతలపూడి	32	495.60
జంగారెడ్డిగూడెం	24	349.60
కామవరపుకోట	14	85.40
లింగపాలెం	22	382.90
ద్వారకాతిరుమల	25	396.50
మొత్తం	117	1,710.00

వేగంగా జలజీవన్ పనులు

జలజీవన్ మిషన్ పథకం కింద సబ్ డివిజన్‌లోని మండలాల్లో మంచినీటి సరఫరా పనులు చేపట్టాం. వీటిలో కొన్ని పనులు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పనులన్నీ వేగంగా జరుగుతున్నాయి. అలాగే రెండో దశలో కూడా పలు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. అవన్నీ టెండర్ల దశలో ఉన్నాయి. టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం.

– వీఎస్ఎస్‌వీ రామారావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

పేద రైతుల సంక్షేమమే లక్ష్యం



చాట్రాయిలో పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: పేద రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో రైతులకు అసైన్డ్ భూముల పట్టాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ హయాంలో అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చారని మరలా ఇన్నేళ్లకు సీఎం జగన్ పంపిణీ చేశారన్నారు. చంద్రబాబు పాలనలో అసైన్డ్ భూములకు ఎందుకు పట్టాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. పట్టాలు ఇచ్చిన భూములకు హక్కు కల్పించడంతో పాటు భూములకు విలువ పెరుగుతుందన్నారు. 574 మంది రైతులకు 576 ఎకరాలు, 79 మందికి 39 ఎకరాలకు సంబంధించి పట్టాలు పంపిణీ చేశారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, తహసీల్దార్ విశ్వనాథరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొమ్మూరులో మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్



ఏలూరు కలెక్టరేట్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): జిల్లాలోని ఆగిరిపల్లి మండలం కొమ్మూరులో రూ.144 కోట్లతో 32.94 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్న మొక్కజొన్న నుంచి స్టార్చ్ ఉత్పత్తి ప్రాసెసింగ్ యూనిట్ (శ్రీ వెంకటేశ్వర బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్)కు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి స్థానిక కలెక్టరేట్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటేశ్వర బయోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం మొక్కజొన్న నుంచి స్టార్చ్, ఇతర ఉత్పత్తుల తయారీకి ప్రతిపాదనలు పెట్టిందన్నారు. ఈ యూనిట్‌కు రోజుకు 300 టన్నుల మొక్కజొన్నను ప్రాసెస్ చేయగల సామర్థ్యం ఉంటుందని, ప్రత్యక్షంగా 210 మందికి, పరోక్షంగా 100 మందికి ఉపాధి కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర బయోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ చైర్మన్ కాశీవిశ్వనాథం వంటిపల్లి, ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, సీపీఓ శ్రీనివాస్, ఇండస్ట్రీస్, డిస్ట్రిక్ట్ రిసోర్సు పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీధర్



మాట్లాడుతున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీధర్

ఏలూరు(మెట్రో): ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్ నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఓటర్ల జాబితా సవరణపై ఆయన సమీక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. భవిష్యత్‌లో అనుసరించాల్సిన విధానాలపై మార్గదర్శకాలను జారీ చేశారు. వచ్చేనెల 2, 3 తేదీల్లో నిర్వహించే ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమానికి సంబంధించి సంబంధిత బీఎల్‌ఓలు పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉండేలా చూడటంతోపాటు, యువతను ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందన్నారు.

అందరూ సహకరించాలి

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడం ద్వారా ఎన్నికల ప్రక్రియను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడానికి వీలుంటుందని ఎన్నికల పరిశీలకుడు శ్రీధర్ అన్నారు. ఫొటో ఓటరు జాబితాల సంక్షిప్త సవరణ–2024కి సంబంధించి సమీక్షించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు గల వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఫొటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ఓటర్లను నమోదు చేయాలని, ఓటర్ల జాబితాలు స్వచ్ఛీకరణ, ఓటర్ల నమోదు ముఖ్యమన్నారు. తొలుత జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలో జనాభా, ఈపీ రేషియో, జెండర్ రేషియో, పోలింగ్ కేంద్రాల వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు 1,95,122 క్లయిమ్‌లను స్వీకరించగా వాటిలో ఇప్పటికే 1,85,052 పరిష్కరించామన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో స్వీప్ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ప్రక్రియపై సంతృప్తి

రాజకీయ పార్టీల ప్రతినిధులు సిర్రా భరత్ (బీఎస్పీ), నెరుసు నెలరాజు (బీజేపీ), ఎ.రవి (సీపీఎం), రాజనాల రామ్మోహన్ రావు (కాంగ్రెస్), పాలి ప్రసాద్ (టీడీపీ), కలవకొల్లు సాంబ (వైఎస్సార్‌సీపీ) జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో పాల్గొన్నామన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఈఆర్‌ఓలు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య, పోలవరం ప్రాజెక్ట్ ఆర్‌ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలి, ఏఈఆర్‌ఓలు, ప్రత్యేక ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

రేలారే.. రేలా..



కామయ్యకుంట గ్రామం వ్యూ

వారు కాలు కదిపారంటే.. అందరి కళ్లూ వారివైపే ఉంటాయి. వారి డోలు వాయిద్య స్వరాలు ఆహ్లాదంలో ముంచెత్తుతాయి. రేలారే రేల అంటూ రేల పాటలతో చేసే నృత్యాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయి. వారి కట్టుబొట్లు.. వేషధారణ.. ప్రత్యేకంగా నిలుస్తాయి. వారే గిరిజన సంప్రదాయ నృత్య కళాకారులు. గిరిజన సంప్రదాయ నృత్యానికి ఉన్న ఆదరణను కాపాడుకుంటూ.. రాష్ట్రవ్యాప్తంగా జరిగే భారీ కార్యక్రమాల్లో తమ నృత్యాలు ప్రదర్శిస్తూ.. ఆ కార్యక్రమాలకే కళాకాంతులు తెస్తారంటే అతిశయోక్తి కాదు. ఈ గిరిజన సంప్రదాయ నృత్యానికి కేరాఫ్ అడ్రస్‌గా.. కొమ్ము, డోలు నృత్య కళాకారులకు పెట్టింది పేరుగా నిలుస్తోంది ఏలూరు జిల్లా మన్యంలోని కామయ్యకుంట గ్రామం.

- కొమ్ము.. డోలు.. రేల నృత్యం కామయ్యకుంటకే ప్రత్యేకం
- సీఎం, మంత్రుల బహిరంగ సభల్లో ప్రత్యేక ఆకర్షణగా వీరి నృత్యాలు
- గిరిజన సంప్రదాయ నృత్యాలకు జీవం పోస్తున్న కళాకారులు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలతో గ్రామానికి వన్నె



సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : అది ముఖ్యమంత్రి హాజరయ్యే సభ అయినా.. ముఖ్య నేతల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యే కార్యక్రమం అయినా.. శుభకార్యాలు అయినా.. అక్కడ ఏర్పాటు చేసే గిరిజనుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ముఖ్య నాయకులకు స్వాగతం పలకడం.. వేదికపై తమ నృత్యాలతో సందడి చేయడం.. వారి ప్రత్యేకత. పెద్ద సంఖ్యలో హాజరయ్యే ప్రజానీకాన్ని వారి వేషధారణ, వాయిద్యాలు, కట్టుబొట్లు, నృత్యాలు.. విశేషంగా ఆకట్టుకుంటాయి. ఏలూరు జిల్లా మన్యం ప్రాంతంలోని మారుమూల కుగ్రామం కామయ్యకుంటకు చెందిన ఈ కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ గ్రామం గిరిజన సంప్రదాయ నృత్య కళాకారులకు పుట్టిల్లుగా వర్ధిల్లుతోంది. ఈ గ్రామానికి చెందిన కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రదర్శనలు ఇస్తూ తమ ఊరి పేరు మార్మోగేలా చేస్తున్నారు. 1,200 మంది జనాభా నివసించే ఈ గ్రామంలో 20 మందికి పైగా కొమ్ము, డోలు నృత్య కళాకారులు ఉన్నారు. తమ పూర్వీకుల నుంచి అందిపుచ్చుకున్న కళకు ఏళ్లతరబడి వీరు జీవం పోస్తున్నారు. మడకం రాముడు అనే గిరిజన సంప్రదాయ నృత్య కళాకారుడి ఆధ్వర్యంలో వీరంతా బృందంగా ఏర్పడి ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఐటీడీఏ ద్వారా శిక్షణ

కామయ్యకుంట గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాల్లో గిరిజన సంప్రదాయ నృత్యాల పట్ల ఆసక్తి ఉన్న గిరిజన యువతీ యువకులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణ పూర్తయిన తర్వాత మూడేళ్లపాటు అన్ని గ్రామాల వారూ నృత్యాలు చేసినా.. కొంతకాలం తర్వాత కామయ్యకుంటకు చెందిన నృత్య కళాకారులే మిగిలారు. వీరు మాత్రమే గత 15 సంవత్సరాలుగా సంప్రదా య నృత్యాలను ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ, గ్రామాల్లోని శుభకార్యాల్లోనూ చేస్తూ వస్తున్నారు. వీరికి డోలు, కొమ్ములతో పాటు దుస్తులను కూడా ఐటీడీఏ సరఫరా చేసింది. రాష్ట్రంలో ఎక్కడ కార్యక్రమాలు జరిగినా కామయ్యకుంట నుంచి గిరిజన సంప్రదాయ నృత్య కళాకారులు హాజరవుతున్నారు. దీంతో కామయ్యకుంట గ్రామానికి కొమ్ము నృత్య కళాకారుల పుట్టిల్లుగా పేరొచ్చింది.



సంప్రదాయ గిరిజన నృత్యాలు చేస్తున్న కామయ్యకుంట గిరిజనులు

పలు జిల్లాల్లో నృత్య ప్రదర్శనలు చేశాం



మారుమూల కుగ్రామానికి చెందిన మేము శ్రీకాకుళం, అరకు, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి అనేక ప్రాంతాల్లో మా నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం కామయ్యకుంట పేరు చెబితే కొమ్ము, డోలు నృత్య కళాకారులు గుర్తుకురావడం సంతోషంగా ఉంది.

– మడవి ప్రసాద్, గిరిజన సంప్రదాయ నృత్య కళాకారుడు, కామయ్యకుంట

చాలా గర్వంగా ఉంది



ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల కార్యక్రమాల్లో స్వాగతం పలికేందుకు మారుమూల అటవీ ప్రాంతంలో ఉండే కొమ్ము, డోలు, రేల పాటల కళాకారులుగా మా గ్రామస్తులకు అవకాశం రావడం ఉంతో ఆనందంగా ఉంది. కామయ్యకుంట గ్రామం పేరు మరింత పెరగడం ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

– పెదకం విజయలక్ష్మి, సర్పంచ్, కామయ్యకుంట

ఐటీడీఏ శిక్షణ అందించింది



మా ఊరికి చెందిన సుమారు 25 మంది కళాకారులకు కేఆర్ పురం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అది సంప్రదాయ నృత్యాలు మరింత లయబద్ధంగా చేయడానికి ఉపయోగపడింది. దీంతో రాష్ట్రంలోనే మా గ్రామానికి మంచి పేరు వచ్చింది.

– కుర్సం సూర్యకుమారి, గిరిజన సంప్రదాయ నృత్య కళాకారిణి, కామయ్యకుంట

సంప్రదాయాన్ని కాపాడుకుంటున్నాం



అంతరించిపోతున్న మా గిరిజన సంప్రదాయ నృత్యాలను మేము నేటికీ కాపాడుకోవడం ఆనందంగా ఉంది. మారుమూల కుగ్రామంలో ఉన్న మేము గిరిజన సంప్రదాయ నృత్యాల వల్ల రాష్ట్ర నలుమూలల్లో అందరికీ పరిచయమయ్యాం.

– పైడా మల్లేశ్వరరావు, గిరిజన సంప్రదాయ నృత్య కళాకారుడు, కామయ్యకుంట

కళలకు జీవం పోస్తున్నారు



కొండకోనల్లో గిరిపల్లెల్లో జీవించే గిరిజనులు గ్రామాల్లో జరిగే పండుగలు, ఇళ్లల్లో జరిగే శుభకార్యాల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలు చేయడం ఆనవాయితీ. ప్రస్తుత రోజుల్లో సంస్కృతీ సంప్రదాయాలను మరచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి సమయంలో మా గ్రామానికి చెందిన కళాకారులు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తెస్తూ, కళలకు జీవం పోస్తుండటం ఎంతో ఆనందంగా ఉంది.

– కొవ్వాసి వరలక్ష్మి, ఎంపీటీసీ, కామయ్యకుంట

కాలువ గట్టు మట్టిని కొల్లగొడుతున్న జనసేన నేత

ద్వారకాతిరుమల: పోలవరం కుడికాలువ గట్టును తవ్వేస్తూ.. పోలీసులకు ఎన్నిసార్లు పట్టుబడినా జనసేన నాయకుడు సురేంద్ర తీరు మాత్రం మారడం లేదు. తాజాగా మంగళవారం సురేంద్ర మరోసారి పోలీసులకు చిక్కాడు. స్థానికుల కథనం ప్రకారం.. భీమడోలు మండలం సూరప్పగూడెంకు చెందిన జనసేన నాయకుడు కొన్నాళ్లుగా మండలంలోని గుణ్ణంపల్లి వద్ద పోలవరం కుడికాలువ గట్టు మట్టిని పొక్లెయిన్‌తో తవ్వి అమ్ముకుంటున్నాడు. ఎన్నిసార్లు అధికారులు అడ్డుకున్నా, పోలీసులు కేసులు నమోదు చేసినా అతడి తీరులో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 28న గుణ్ణంపల్లి వద్ద కాలువ గట్టును పొక్లెయిన్‌తో తవ్వుతుండగా, పోలవరం కుడి కాలువ ఇరిగేషన్ ఏఈ సీహెచ్ బాబూజీ, పోలీస్, రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఆ సమయంలో అక్కడున్న జనసేన నేత సురేంద్ర ఏఈ బాబూజీపై దురుసుగా ప్రవర్తించినట్టు తెలిసింది. దీంతో ఏఈ ఫిర్యాదు మేరకు పొక్లెయిన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా ఆచార్య చంద్రశేఖర్



నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీకి నూతన డైరెక్టర్‌గా నియమితులైన ఆచార్య మట్లి చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నూజివీడు ట్రిపుల్ ఐటీకి డైరెక్టర్‌గా నియమించింది. ఈయన వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, రిజిస్ట్రార్‌గా, గేమ్స్ కమిటీ చైర్మన్‌గా, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్‌గా, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్‌గా పలు బాధ్యతలను నిర్వర్తించారు. సివిల్ ఇంజినీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్‌లో మంచి పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నూతన డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ పేరును దేశమంతా తెలిసేలా అకడమిక్ పరంగా అభివృద్ధి చేయడంతో పాటు ఇప్పటివరకు ఇక్కడ లేని రీసెర్చ్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. ఈ ఇనిస్టిట్యూట్‌లను ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసినందున ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆచార్య చంద్రశేఖర్‌కు యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, ఏవో ప్రదీప్ తదితరులు స్వాగతం పలికారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

భీమవరం అర్బన్: ఆస్తి కోసం పెద్దమ్మకు కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి ఇచ్చి హత్య చేసిన కేసులో చెల్లి కొడుకుతో సహా మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ చెప్పారు. భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను బుధవారం సీఐ వెల్లడించారు. తోకలిపల్లో అంద్రాజు మద్దూరి (47)కు ఆమె సోదరి మధ్య ఆస్తి తగాదా ఉంది. మద్దూరికి చెందిన నాలుగు సెంట్ల స్థలాన్ని పెద్దమ్మ మద్దూరి ఖాళీ చేయడం లేదని ఆమెను హతమార్చేందుకు చెల్లి కుమారుడు రామాని నాగార్జున పథకం పన్నాడు. దీనిలో భాగంగా ఈ నెల 25న పెద్దమ్మ మద్దూరికి కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి ఇచ్చాడు. అది తాగిన ఆమె కాళ్లచేతులు లాగుతున్నాయంటూ పొరుగింటికి వెళ్లి అక్కడ స్పృహతప్పి పడిపోయి మృతి చెందింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసులో చెల్లి కొడుకు రామాని నాగార్జున, మిండ్యాల ఏసుబాబు, నక్కా ఏసుబాబులను నిడమర్రులో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. హత్య సమయంలో ఉపయోగించిన బైక్, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ అభినందించారు.

3 నుంచి విఖనస విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో డిసెంబర్ 3వ తేదీ నుంచి శ్రీభృగు, మరీచి, అత్రి, కశ్యప శిష్య సహిత విఖనస మహా ముని విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ తూర్పు ప్రాంతంలోని జంట గోపురాల సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు డిసెంబర్ 6వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నూతన ఆలయాన్ని సిబ్బంది రంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయిస్తున్నారు.

జూదరుల అరెస్టు

ద్వారకాతిరుమల: దొరసానిపాడులో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. వారి నుంచి రూ. 12,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.